జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీ..మీ.. మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 19-04-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 649 పేజీలు: 4 వెల: రూ.7

ప్రజల ప్రాణాలతో.. చెలగాటమా?

- హెచ్‌టీ లైన్ కిందనే గృహ విద్యుత్ కనెక్షన్ - కాశీబుగ్గలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం
- ప్రాణాలకు ముప్పు తేనున్న అధికారుల నిర్ణయం -ముడుపుల అందడంతోనే అనుమతిచ్చారని స్థానికుల ఆరోపణ - ఉన్నతాధికారులు స్పందించాలని అభ్యర్థన

కాశీబుగ్గలో ప్రజల ప్రాణాలతో విద్యుత్ శాఖ ఆటలాడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా గృహ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయడమే ఇందుకు నిదర్శనం.

హెచ్‌టీ విద్యుత్ లైన్ కింద ఎటువంటి కనెక్షన్ ఇవ్వకూడదని నిబంధన ఉన్నప్పటికీ అధికారులు అదేమీ తమకు పట్టనట్టు వ్యవహరించారు. తమకు ముడుపులు అందడంతో గాంధీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి పైనుంచే హెచ్‌టీ విద్యుత్ లైన్లు వెళ్తున్నపటికీ ఎంచక్కా గృహ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేశారు. దీంతో స్థానికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రేపు ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని నిలదీస్తున్నారు. తమ ప్రాణాలంటే వారికి లెక్కలేదా అని అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

(పలాస)

కాశీబుగ్గలో విద్యుత్ శాఖ వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీ యాంశంగా మారింది. గాంధీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ గృహానికి, అదే ఇంటి పైనుంచి హైటెన్షన్ విద్యుత్ లైన్లు వెళ్తున్నప్పటికీ కనెక్షన్ మంజూరు చేయడం సంచలనం రేపుతోంది. నిబంధనల ప్రకారం హెచ్‌టీ లైన్ కింద ఉన్న గృహాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం పూర్తిగా నిషేధం. కానీ అధికారులు వాటిని పూర్తిగా పక్కనబెట్టి కేటగిరీ-2 మీటర్ ఇవ్వడంపై స్థాని కులు మండిపడుతున్నారు. ఈ కనెక్షన్ కోసం దాదాపు రూ.40 వేల వరకు అక్రమంగా వసూలు చేశారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

ప్రమాదాలకు ఆస్కారం..

అధిక వోల్టేజ్‌తో విద్యుత్ ప్రవహించే హెచ్‌టీ లైన్ కింద ఇలాంటి కనెక్షన్లు ఇవ్వడంతో ఎప్పుడైనా అగ్ని ప్రమాదం లేదా ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చ రిస్తున్నారు. దీంతో తమ ప్రాణాలతో ఆటాడుతున్నారా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆ పక్కన భవంతిలో విద్యుత్ పనులు చేస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ భవంతిలో పనులకు వైరింగ్ చేస్తున్న క్రమంలో ఎల్‌ట వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై గాయాల పాలైన సంఘటన మరవక ముందే పక్క భవంతిలో విద్యుత్ మీటర్ వేయడంపై స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ మీటర్ వేయడానికి అధికారులకు భారీగా ముడుపులు అందాయని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యు లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పలాస విద్యుత్ శాఖ డీఈ యజ్ఞేశ్వరరావు వివరణ కోరగా ఆయన స్పందించారు. విద్యుత్ ఏఈతో పరిశీలన చేపట్టి తగిన చర్యలు తీసు కుంటామని తెలిపారు.

ప్రజా గ్రీవెన్స్‌కు విశేష స్పందన

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18 (వార్త): ఇచ్ఛాపురంలోని మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండర్కర్ అధ్యక్షతన శనివారం జరిగిన ప్రజా గ్రీవె న్స్‌కు విశేష స్పందన లభించింది. 63 వినతులు అందాయి. మున్సిపాల్టీ ఏర్పడి 40ఏళ్లు గడుస్తున్నా నేటికి 1,2,3 వార్డుల ప్రజలకు కొళాయిల ద్వారా తాగునీటిని అందించలేకపోతున్నారని, చాలీచాలని ట్యాంకర్లతో అందుతున్న నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి పరిష్కారానికి శాశ్వత పరి ష్కారం చూపించాలని మాజీ కౌన్సిలర్లు పత్రి తవి టయ్య, ఆశి లీలారాణి ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. బాహుదా నది వంతెన సగభాగం కూలి మూడేళ్లు గడుస్తుందని, నూతన వంతెన నిర్మా ణానికి చర్యలు తీసుకోవాలని, ఒడిశా నుంచి వస్తున్న వర్షపు నీటితో పొలాలు నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లు తోందని, వెంటనే బెల్లుపడ రక్షణ గోడ (వరదగట్టు)కు గట్టు నిర్మాణం చేపట్టాలని వినతి పత్రాన్ని అందజేశారు. సచివాలయాల్లో సిబ్బంది కొరతతో ఎటువంటి పనులు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సిబ్బంది కొరత తీర్చా లని లీలారాణి ఫిర్యాదు చేశారు. 100పడకల ఆసు పత్రి నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని, పైడిగాం ప్రాజెక్ట్ మరమ్మతు లకు రూ.10కోట్లు, పొత్తంగివద్ద గ్రోయిన్ మరమ్మ తులకు రూ.55 లక్షలు నిధులు మంజూరు చేయా లని కోరారు. వంశధార-బాహుదా నదుల ఇంటర్ లింక్ ప్రాజెక్ట్ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, ఇచ్ఛా పురంలో మినీ స్టేడియం నిర్మాణం, బాహుదాపై కొత్త వంతెన నిర్మాణం, కవిటిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు, ఇచ్ఛాపురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ నాయకులు దాసరి రాజు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, మున్సిపల్ ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి, సుడా డీఈ సుగుణాకర్, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, తహశీల్దార్ ఎన్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మీ ఇల్లూ.. ఇంతేనా?

- -ఎల్ఎన్ పేట కేజీబీవీ బోధనేతర సిబ్బందిపై ఎమ్మెల్యే మామిడి ఆగ్రహం
- -వంటగది అపరిశుభ్రతపై అసంతృప్తి
- - పాడైపోయిన కూరగాయల నిల్వలపై మండిపాటు
- - పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

ఎల్ఎన్ పేట, ఏప్రిల్18(వార్త): లక్ష్మీనర్సుపేట కేజీబీవీ పాఠశాల బోధనేతర సిబ్బంది పనితీరుపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మండి పడ్డారు. శనివారం ఆ కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రుచి చూసి, మెనూ అమ లుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వంట గది పరిశు భ్రంగా లేకపోవడంతో సిబ్బందిపై మండిపడ్డారు. విద్యార్థినులకు ప్రభుత్వం అందజేస్తున్న మెనూను సక్రమంగా ఎందుకు అమలు చేయడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడైపోయిన కూరగా యలు నిల్వ ఉంచడం చూసి, మీ ఇళ్లలో కూడా ఇలాగే ఉంచుతారా అంటు సిబ్బందిని మందలిం చారు. వారి పనితీరుపై ఆరా తీసి, ఇకనుంచి తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మెండ మనోహర్‌నాయుడు, పాతపట్నం నియోజకవర్గ తెలుగుయువత నాయకులు అంపిలి పోలినాయుడు, మాజీ సర్పంచ్‌లు వెలమల గోవింద రావు, నడిపల్లి నారాయణరావు, నాయకులు పాణిగ్రాహి, కొమరాపు చిరంజీవి, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

-డైనమిక్ బీట్ సిస్టమ్ సమర్థంగా అమలు చేయాలి

-నెలవారీ నేర సమీక్ష సమావేశంలో పోలీసు అధికారులకు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18 (వార్త): జిల్లాలో నేర నియంత్రణ చర్యలను మరింత బలోపేతానికి రాత్రి వేళల్లో డైనమిక్ బీట్ సిస్టమ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసుల దర్యాప్తు, విచారణను వేగవంతం చేసి, కేసులు పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్ (ఎన్‌బీడబ్ల్యూ)పై సమీక్ష నిర్వహించి, చాలా కాలంగా అమలు కాని వారెంట్లను తక్ష ణమే అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను గుర్తించి ట్రేస్ చేసి కోర్టులో హాజరు పరచాలని సూచించారు. రాత్రి బీట్ సిస్టమ్‌ను మరింత బలోపేతం చేస్తూ, బీట్‌లను పునర్వ్యవస్థీకరించి అవసరమైన ప్రాంతాల్లో బీట్ సంఖ్యను పెంచాలని ఆదేశించారు. తరచుగా నేరాలు జరిగే ప్రాంతాల్లో బీట్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించి, నేరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ మిస్సింగ్ కేసులను వేగవంతంగా ఛేధించాలని, సీసీ టీవీ కెమె రాలు, డేటా అనలిసిస్ వంటి ఆధునిక పద్ధతులను సమర్థవంతంగా వినియో గించాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను కోర్టు ఆదేశాల మేరకు చట్టబద్ధంగా డిస్పోజ్ చేయాలని, స్టేషన్లలో అనధికారంగా నిల్వ ఉంచ రాదని స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదులను సమయానికి పరిష్కరించాలని దిశా నిర్దేశం చేశారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ నియమాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూ, హెల్మెట్ డ్రైవ్, డ్రంకెన్ డ్రైవ్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా సాంకేతిక అప్లికేషన్ల విని యోగాన్ని పెంపొందించి, కేసుల దర్యాప్తులో పురోగతిని సాధించాలని, ఆన్‌లైన్ పోర్టల్స్‌లో సమాచార నమోదు విధానాన్ని మెరుగుపరచాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టి, సైబర్ నేరాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేసి ప్రజలతో మమేకం కావాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి సమన్వయంతో విధులు నిర్వహించా లని ఎస్పీ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా అవినీతిని సహించబోనని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, భవాని, ఎస్బీ, టాస్క్‌ఫోర్స్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు ఇమ్మాన్యుయేల్ రాజు, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

కొటేరుబంద ఆక్రమణలపై దర్యాప్తు చేయండి

-కలెక్టర్‌కు టీడీపీ నేతలు శంకర్‌రెడ్డి, లీలారాణి వినతి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18 (వార్త): బెల్లుపడ గ్రామానికి ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 212-2 నందు 34.30 ఎకరాల కొటేరు బంద ఆక్రమణలపై దర్యాప్తు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండర్కర్‌ను తెలుగుదేశం నాయకులు కొండా శంకర్‌రెడ్డి, ఆసి లీలారాణి కోరారు. ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయనకు వారు వినతి పత్రాన్ని అందజేశారు. కొటేరు బంద కోదండరామ చెరు వులో 10.52 ఎకరాలు స్థలం ఆక్రమణలకు గురైందని, అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చెరువును పరిశీలించి ఆక్రమణలను తొలగించి అభివృద్ధి చేయాలని వారు విన్నవించారు.

డ్రాపవుట్లు లేకుండా సహకరించండి

మెళియాపుట్టి, ఏప్రిల్ 18(వార్త): బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించి డ్రాపవుట్లు లేకుండా తల్లిదండ్రులు సహకరించాలని క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు డీవీఎస్ఆర్‌వీ మహాలక్ష్మి కోరారు. దీనబంధుపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జెన్ని సంపతిరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన బడి పిలుస్తోందిలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులతో పలు నినాదాలు చేయిస్తూ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొని అనేక అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ సభ్యులు, అంగన్‌వాడీ, ఉపాధి హామీ పథకం, వివిధ విభాగాల సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మన ఊరి బడిని కాపాడుకుందాం

నరసన్నపేట, ఏప్రిల్ 18(వార్త): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి "మన ఊరి బడిని కాపాడుకుందాం.. బడి పిలుస్తుంది" కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంఈఓ పేడాడ దాలినాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. సత్యవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల ఇళ్లకు నేరుగా వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. ప్రభుత్వ బడి తల్లి లాంటిదని, దానిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

నేడు మందసలో వెంకన్నచౌదరి పర్యటన

మందస, ఏప్రిల్ 18(వార్త): తెలుగుదేశం పార్టీ పలాస సమన్వయకర్త వై.వెంకన్నచౌదరి(వీసీ) ఆదివారం మందస మండలంలో పర్యటిస్తారని ఆ పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన తెలిపారు. బెల్లుపట్టియా, హెన్నాలి, సిద్ధిగాం, జిల్లుండ, సొండిపూడి, మూలిపాడు, కొత్తపల్లి, భిన్నల మదనాపురం గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న క్లస్టర్ కన్వీనర్, కో-కన్వీనర్, గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయ కులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 20వ వర్ధంతి వేడుకలు మందస, హరిపురం-బాలిగాం జంక్షన్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు బావన దుర్యోధన తెలిపారు. చెప్పారు. ఉదయం 8గంటలకు హరిపురం-బాలిగాం జంక్షన్, మందస టౌన్ లో 8.15గంటలకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పిడుగు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మందస, ఏప్రిల్ 18(వార్త): పిడుగుపాటుతో పెద్దకేశుపురంనకు చెందిన తల్లీ..కుమార్తెలు మడియా కృష్ణవేణి, యోగేశ్వరి ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. దీంతో ఆమె పెద్ద కుమార్తె అనాథగా మారింది. ఈ విషయం తెలుసుకున్న స్వామి వివేకానంద సేవా సమితి వారు దాతల సహకారంతో ఆమెకు రూ.10వేలు శనివారం అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఎస్వీఎస్ఎస్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

తొగిరిలో గ్రామసభ

సారవకోట, ఏప్రిల్ 18(వార్త): తొగిరిలో నిర్వహించిన గ్రామసభలో తెలుగుయువత మండల అధ్యక్షుడు పిళ్ళా నందకిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో సమావేశమై పంచాయతీ పరిపాలనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. నందకిషోర్ మాట్లాడుతూ తొగిరి పంచాయతీకి ప్రత్యేక అధికారిగా నియమితులైన చల్లా కిషోర్‌కుమార్‌ను పరిచయం చేస్తూ, ఆయనతో సమన్వయంతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి చల్లా కిషోర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి తర్ర సుబ్బినాయుడును సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సహాయకురాలు, ఆశ వర్కర్, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

గొల్లలవలసలో లేగ దూడల ప్రదర్శన

-ఉత్తమ దూడలకు బహుమతులు - రైతుల్లో ఉత్సాహం

పోలాకి, ఏప్రిల్ 18(వార్త): గొల్లలవలస గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధక రంగ అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఉన్న లేగ దూడలను ఎమ్మెల్యే పరిశీలించి రైతులతో ముచ్చటించారు. పశుసంవర్ధక రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారం అని పేర్కొంటూ, లేగ దూడల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రదర్శనలో ఉత్తమ లేగ దూడలను ఎంపిక చేసి రైతులకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఏసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, క్లస్టర్ ఇంచార్జ్ సూరపు నారాయణదాసు, మాజీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వేణుగోపాలస్వామి, మాజీ సర్పంచ్ పంచిరెడ్డి సింహాచలం, పంగ సత్యం, పంగ శ్రీను, మెండ రామారావు, పశువైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం

-టీడీపీ శ్రేణులకు పలాస సమన్వయకర్త

వెంకన్న చౌదరి పిలుపు

పలాస, ఏప్రిల్ 18 (వార్త): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని, ప్రజల మద్దతుతో రానున్న స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని పలాస నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన పలాస మండలంలోని రెంటికోట, అట్టుకోట, లొద్దభద్ర, కేదారిపురం, వజ్రపు కొత్తూరు మండలం వంద్రుకుడియాకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించడానికి తీసుకోవాల్సిన వ్యూహాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా వెంకన్న చౌదరి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ప్రజలతో సన్ని హితంగా ఉండి ప్రభుత్వ పథకాలు, పార్టీ విధానాలను ప్రజలకు చేరవేయాలని కోరారు. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, ప్రజలకు సేవ చేయగల నాయకులను ముందుకు తేవాలని నిర్ణయించారు. రానున్న స్థానిక ఎన్నికల సమయంలో ప్రతి ఒక్క తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశి క్షణతో పనిచేస్తూ పార్టీ ప్రతిష్టను నిలబెట్టాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషితోనే విజయం సాధ్యమవుతుందని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజల మద్దతుతో రానున్న స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పీరుకట్ల విఠల్‌రావు, పలాస పీఏసీఎస్ ఛైర్మన్ వంకల కూర్మారావు, కుతుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్‌నాయుడు, పలాస మండల అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్ కన్వీనర్ కో కన్వీనర్లు యూనిట్ కన్వీనర్ కో కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సేవలు మరువలేనివి

జి.సిగడాం, ఏప్రిల్ 18(వార్త): గ్రామాభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన సర్పంచుల సేవలు మరువలేనివని మండల పీఏసీఎస్ ఛైర్మన్ బెవర జగన్నాథరావు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి కొనియాడారు. గ్రామ ప్రజాపతినిధులు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు కలిసి మాజీ సర్పంచ్ కామోజుల ఆరుద్ర, టీడీపీ సీనియర్ నాయకులు కామోజుల సీతారాంనకు శనివారం గ్రామ సచివాలయ ఆవరణలో అభినందన సత్కారం నిర్వహించారు. మెట్టవలస గ్రామ ప్రత్యేకాధికారిగా నియమితులైన మండల వ్యవసాయాధికారి బెండి బాబ్జీకి సన్మానించారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పదేళ్లుగా ఆరుద్ర, సీతారాం చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య, ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. నిస్వార్థంతో సేవలందించిన ప్రజాప్రతినిధులుగా చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. అనంతరం ఆరుద్ర, మాట్లాడుతూ సర్పంచ్‌గా గెలిపించి ఐదేళ్లుగా అన్ని విషయాల్లో తమకు సహకరించిన ఎంపీటీసీ సభ్యురాలు బెవర విజయలక్ష్మి, జగన్నాథరావు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. రానున్న రోజుల్లో సర్పంచ్‌గా ఎవరు ఎన్నికైనా గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ, గ్రామ సచివాలయ సిబ్బంది. గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి

సోంపేట, ఏప్రిల్ 18(వార్త): ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోంపేటలో పట్టణ శ్రీశయన సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెళ్ల నారాయణరావు తగు ఏర్పాట్లు చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న సర్దార్ విగ్రహానికి పలు సౌకర్యాలను నారాయణరావు సమకూర్చారు. అనేక సంవత్సరాలుగా ఎండలోనే ఉంటున్న సర్దార్ విగ్రహానికి షెడ్డు ఏర్పాటు చేసి నీడ కల్పించారు. ఆదివారం ఉదయం లచ్చన్న తనయుడు మాజీ మంత్రి శివాజీ ఈ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించనున్నట్టు టిడిపి వర్గాలు తెలిపాయి. పట్టణ టిడిపి శ్రేణులు, శ్రీశయన సంఘాలు, చైతన్య దీపిక, లచ్చన్న అభిమానులు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిసింది.

నెరవేరని లచ్చన్న విగ్రహ కల..

సర్దార్ గౌతు లచ్చన్న స్వస్థలమైన సోంపేటలో ఇప్పటికీ సరైన విగ్రహం ఏర్పాటు చేయకపోవడంతో ఆయన అభిమానులలో తీవ్ర నిరాశ వ్యక్తం అవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట మెయిన్ రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన చిన్నపాటి విగ్రహం మినహాయిస్తే సోంపేటలో చెప్పుకోదగ్గ విగ్రహం లేకపోవడం బాధాకరమని లచ్చన్న అభిమానులు వాపోతున్నారు. ఎంతోకాలంగా సోంపేటలో గౌతు లచ్చన్న కు నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలన్న ఆలోచన పలువురిలో ఉన్నప్పటికీ ఆచరణలో ప్రతిసారి ఏదో ఒక ఆటంకం ఏర్పడుతుంది. అధిక మొత్తంలో ఖర్చు అయినప్పటికీ దీన్ని భరించేందుకు లచ్చన్న అభిమానులు, పలువురు నాయకులు ముందుకు వస్తున్నప్పటికీ ఏదో ఒక సమస్య విగ్రహం ఏర్పాటు విషయంలో ముందుకు అడుగు పడకుండా పోతుంది. ఈ కల ఎప్పటికి నెరవేరుతుందో వేచి చూడాల్సి ఉంది.

జవాబుదారీతనానికే మహిళాసంఘాల ఆడిట్

మందస, ఏప్రిల్ 18(వార్త): ఆర్థిక లావాదేవీలపై పూర్తిస్థాయి అవగాహన, జవాబుదారీతనం పెంపొందించడానికి అన్ని మహిళా సంఘాలు తమ రికార్డులను ప్రతీ ఏడాది ఆడిట్ చేయించాలని మందస ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. శనివారం ఆయన మందసలోని మండల సమాఖ్య కేంద్రంలో అన్ని గ్రామ సంఘాల 2025-26 ఆర్థిక సంవత్సర లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించారు. తీర్మానం పుస్తకం, రసీదు, ఓచర్ తనిఖీ చేశారు. బ్యాంకు పాస్‌బుక్స్‌లో లావాదేవీలను, లోన్ లెడ్జర్, జనరల్ లెడ్జర్ తదితర రికా ర్డుల నిర్వహణ, ముగింపు లెక్కలు తయారు చేసి జమలు, చెల్లింపులు, ఆదాయ వ్యయాలు, ఆస్తి-అప్పుల పట్టికలు తయారుచేసి చార్టర్డ్ అకౌంటెంట్‌తో ధ్రువీ కరణ చేయించుకోవాలని తెలిపారు. ప్రతీ గ్రామ సంఘంలో కూడా క్లస్టర్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో అన్ని స్వయం సహాయక సంఘాలు కూడా కమ్యూనిటీ ఆడిట్ టీమ్ ద్వారా ఆడిట్ చేయించి, సంఘ సభ్యులకు మీటింగులు పెట్టించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్, క్లస్టర్ కోఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, వీవోఏలు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవత ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాలు

సోంపేట, ఏప్రిల్ 18 (వార్త): తురకశాసనంలో శ్రీ కాల్లెమ్మ, నీలమణి దుర్గ (పాతపట్నం తల్లి) అమ్మవార్ల ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పలు పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బ్రహ్మశ్రీ భూరాడ ఈశ్వర సాయి శర్మ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు మొదలయ్యాయి. అనంతరం పుణ్యాహ వాచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, పంచగవ్యారాధన, మాతృకారాధనలు, అఖండ దీప స్థాపన, ఆచార్య రిత్విక్ వరుణులు, రక్షాధారణ, యాగశాల సంస్కారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సాయంత్రం 3 గంటల నుంచి శ్రీ ముక్కేర పోలమ్మ తల్లి తిరువీధి మహోత్సవం కనుల పండువ గా సాగింది. గ్రామంలో ప్రతి ఇంటి ముందు మహిళలు పూర్ణ కలశాలను ఏర్పాటు చేసి, పసుపు నీళ్లతో అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. వందలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

జి.సిగడాం, ఏప్రిల్ 18(వార్త): గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు, వసతులు తదితర సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారిణి కుసుమ, టీడీపీ మండల అధ్య క్షుడు కుమరాపు రవికుమార్ తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా సచివా లయం లేదా తమ దృష్టికి తెలియజేస్తే పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామ న్నారు. అనంతరం సచివాలయ పరిధి మాజీ సర్పంచులను, నూతన గ్రామ ప్రత్యేకాధికారి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుసుమను కుమరాపు రవికుమార్.. గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలందరూ కలిసి సన్మా నించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య, సుంకరి అప్పన్న, చందక సతీష్‌కుమార్, కుమరాపు శ్రీనివాసరావు, కుమరాపు అప్పన్న, రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులకు పోషణ్ పక్వాడాపై అవగాహన

మందస, ఏప్రిల్ 18(వార్త): ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం వేతనదారులకు అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పోషణ్ పక్వాడా ఆవశ్యకతను వివరించి, వారిని చైతన్య పరుస్తున్నారు. ప్రాజెక్టు అధికారిణి పెద్దింటి అరుణ ఆదేశాలతో హంసరాళి, బిరుబడియా, గుడ్డిభద్ర, మందస, వాసుదేవపురం, కిల్లోయి, బుడారిసింగి, పాతకోట, తులసిగాం, కళింగనగర్, పెదంగో, పద్మాపురం, మహల్పడ, కొరడాబడి, బీఎస్ పురం, ఆర్కేపురం, బాలాజీపురం, గోవిందపురం, పితాతొళి, గోవిందపురం, సిరిపురం, మహదేవు పురం, కిల్లోయి, బంజరియువరాజపురం, మహేంద్రపురం, డబారిసింగి, కుదుమాసాయి తదితర గ్రామాలు, ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లి, వేతనదారులకు అవగాహన కల్పించారు.

మాజీ సర్పంచ్ మోహన్‌రావుకు ఎంజీఆర్ పరామర్శ

ఎల్ఎన్ పేట, ఏప్రిల్18(వార్త) : దబ్బపాడు మాజీ సర్పంచ్ జమ్మి మోహన్‌రావు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు అంపిలి పోలినాయుడు, మాజీ సర్పంచ్ లు వెలమల గోవిందరావు, నడిపల్లి నారాయణరావు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్

కోటబొమ్మాళి, ఏప్రిల్ 18(వార్త): ఫైర్ సర్వీస్ వీక్ సందర్భంగా కోటబొమ్మాళి ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన, మాక్ డ్రిల్స్ నిర్వహించారు. కెన్నెవలసలోని బీఎస్ఎం ఫిల్లింగ్ స్టేషన్, శ్రీ లక్ష్మీ గణపతి గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానంపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. ఇంధన కేంద్రాలు, గ్యాస్ ఏజెన్సీల్లో సంభవించే అగ్ని ప్రమాదాలను ఎలా నియంత్రించాలో వివరించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వివిధ ప్రదేశాల్లో స్టిక్కర్లు అంటించారు.

మాజీ ఎంపీపీకి జుత్తు నీలకంఠం పరామర్శ

మందస, ఏప్రిల్ 18(వార్త): మాజీ ఎంపీపీ, జిల్లా అగ్నికుల క్షత్రియ అధ్యక్షుడు గొరకల వసంతస్వామిని అగ్నికుల క్షత్రియ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జుత్తు నీలకంఠం.. పరామర్శించారు. వసంతస్వామి మాతృమూర్తి శేషమ్మ అనారోగ్యంతో బాధపడుతుండ దంతో పరామర్శించి, త్వరగా కోలుకోవాలని కోరారు. ఆయన వెంట మాజీ ప్రధాన కార్యదర్శి బచ్చల మధు, అగ్నికుల క్షత్రియ వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షుడు ఎలమంచిలి భాస్కరరావు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

తెలుగుదేశం పార్టీ అభివృద్ధిలో ఎంఎల్ఏ శిరీషా కృషి అమోఘం

మందస, ఏప్రిల్ 18(వార్త): తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా ఎంతో కృషి చేశారని తెలుగుదేశం పార్టీ యువజన అధ్యక్షుడు ఔగాన ఈశ్వరరావు కొనియాడారు. మందసలో శనివారం ఈశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. పార్టీ కష్టాల్లో ఉన్న సమయంలో తాను వ్యక్తిగతంగా కూడా సమస్యలు ఎదుర్కొన్నా.. ఆమె ధైర్యం కోల్పోలేదన్నారు. పట్టువదలని విక్రమార్కునిలా పని చేశారని ప్రశంసించారు. దీంతోనే ఎంఎల్ఏగా విజయం సాధించి, పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శిరీషా సేవలను గుర్తించి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆమె నియమించడం ఆమోదనీయమన్నారు. ఆమె నిరంతర కృషి, అంకితభావం, పార్టీపై నిబద్ధతే ఈ బాధ్యతను తెచ్చిపెట్టాయన్నారు. రాబోయే రోజుల్లో శిరీష నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. ఈ సందర్భంగా శిరీషకు ఆయన అభినందనలు తెలిపారు.

పరిశుభ్రతతోనే స్వర్ణాంధ్ర సాకారం

-నెలలో ఒక రోజు పారిశుధ్యానికి కేటాయించాలి
-ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, ఏప్రిల్ 18 (వార్త): పరిశుభ్రమైన పరిసరాలే ప్రజల ఆరోగ్యానికి పునాది అని, స్వచ్ఛాంధ్ర నిర్మాణాన్ని ప్రతి పౌరుడు ఒక సామాజిక కర్తవ్యంగా భావించాలని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం దండివీధి దోబీఘాట్ చెరువు వద్ద నిర్వ హించిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణాల్లో పరిశుభ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి నెల మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పారిశు ధ్యం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వా ములు కావాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలతో పాటు వీధులు, కాలనీలను శుభ్రంగా ఉంచుకోవడంలో చైతన్యంతో వ్యవహరించాలని కోరారు. దండివీధి ప్రాంతంలోని చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, మురుగు నిల్వలు లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ఇలాంటి నిరంతర కార్యక్రమాల ద్వారా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దవచ్చని, తద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంతు కూర్మారావు, పారిశుధ్య సిబ్బంది, స్థానిక నాయకులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమదానం చేశారు.

మన ఊరు బడిని కాపాడుకుందాం ర్యాలీ

సారవకోట, ఏప్రిల్ 18 (వార్త): బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం అలుదు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు..విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. "మన ఊరు బడిని కాపాడుకుందాం" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ బడి మమతల బడి అని పేర్కొంటూ, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

కేజీబీవీలో శక్తి యాప్‌పై అవగాహన

పోలాకి, ఏప్రిల్ 18(వార్త): గంగివలస కేజీబీవీ పాఠశాలలో శనివారం శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టెక్కలి శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు యాప్ ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా సిబ్బందితో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, దాని వినియోగంపై ప్రాయోగికంగా వివరించారు. అన్ని రకాల పోలీస్ సేవలను పొందేందుకు శక్తి యాప్‌లోని టోల్ ఫ్రీ నంబర్లను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం ఇన్చార్జి గిరిధర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు చామంతి, కేజీబీవీ ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించండి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18(వార్త): ఈదుపురం కాంద్ర వార్డ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది విద్యార్థులు కలిసి శనివారం ఈదుపురం గ్రామంలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు.గ్రామంలో ర్యాలీ నిర్వహించి బడి ఈడు పిల్లలను బడిలోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉమామహేశ్వరి, భాస్కర్ పాడి, పాఠశాల సిబ్బంది విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు

ఉత్సాహంగా అగ్నిమాపక వారోత్సవాలు

సోంపేట, ఏప్రిల్ 18(వార్త): సోంపేట అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్, షాపింగ్ మాల్స్ వద్ద ప్రజలను సమీకరించి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకుల సమీపంలో పౌరులు తీసుకోవలసిన జాగ్రత్త చర్యలను అగ్నిమాపక అధికారి సూర్యారావు వివరించారు. ఇటువంటి చోట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అలాగే సమీప ప్రజలకు అగ్ని ప్రమాదాలు నివారణ చర్యలు మొదలైన సూచనలతో కూడిన కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వడా

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18(వార్త): ఈ నెల 23 వరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషణ్ పక్వాడ ప్రోగ్రాం నిర్వహిస్తామని ప్రాజెక్టు ఆఫీసర్ రాజేశ్వరి చెప్పారు. సున్నా నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు మేధావివృద్ధికి జంక్ ఫుడ్ తీసుకోకూడదని, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ నమోదును పెంచాలని కోరారు.

24 చెత్త సేకరణ రిక్షాల మంజూరు

సారవకోట, ఏప్రిల్ 18(వార్త): సారవకోట మండలం పలు పంచాయతీల్లో చెత్త సేకరణకు ప్రభుత్వం 24 రిక్షాలను మంజూరు చేసింది. ఈ రిక్షాల ద్వారా పారిశుధ్య కార్మికులు గృహాల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించనున్నారు. స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ రిక్షాలతో పాటు అవసరమైన బకెట్లను కూడా అందజేసినట్లు ఎంపీడీఓ మోహన్ కుమార్ తెలిపారు. ఈ చర్యల ద్వారా గ్రామాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడంతో పాటు వ్యర్థాల నిర్వహణను సక్రమంగా అమలు చేయడం లక్ష్యమని ఆయన వివరించారు.

20న సోంపేటలో జాబ్ మేళా

సోంపేట, ఏప్రిల్ 18(వార్త): ఈనెల 20న సోంపేట మండల పరిషత్ కార్యాలయం వెనుక వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీవో ఎస్ ప్రసాదరావు తెలిపారు. ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాల కొరకు ఇంటర్ డిగ్రీ ఐటిఐ డిప్లమో పురుష అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 9:30 గంటలకు హాజరు కావాలని కోరారు. ఆకర్షణీయమైన వేతనాలు ఉంటాయని తెలిపారు.

భూహక్కుల స్పష్టతకు సహకరించాలి

-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, ఏప్రిల్ 18(వార్త): కొమనాపల్లిలో శనివారం నిర్వహించిన రీ-సర్వే ప్రాజెక్ట్ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి, భూసర్వే ఖచ్చితత్వం మరియు రికార్డుల స్పష్టత కోసం రీ-సర్వే కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. భూహక్కుల స్పష్టత, రైతులకు న్యాయం, భవిష్యత్ అభివృద్ధి పనులకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సర్వేలో అధికారులకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, పిఎసిఎస్ చైర్మన్లు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, యూనిట్ ఇంచార్జ్ తమ్మన్నగారి సతీష్ కుమార్, మాజీ సర్పంచ్ కనుసు రవి కుమార్, నీటి సంఘం అధ్యక్షులు మెరుగు అసిరినాయుడు, సాధు ఉమారావు, తహశీల్దార్, ఎంపీడీవో, ఏపీవో, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

-ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, ఏప్రిల్ 18 (వార్త): రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పెదపాడు రోడ్డులో గల వీల్స్ మార్ట్ కార్యాలయంలో పద్మ పూజిత గ్రూప్, రెడ్ క్రాస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు మనం ఇచ్చే రక్తం ప్రాణవాయువులా మారుతుందని, యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేసిన స్వచ్ఛంద సేవకులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ఈ శిబిరాలు నిర్వహించడం ద్వారా పద్మ పూజిత గ్రూప్ తన సామాజిక బాధ్యతను చాటుకుందని ఎమ్మెల్యే కొనియాడారు. రెడ్ క్రాస్ సహకారంతో చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో యువత, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వీల్స్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ ఫణి కుమార్, సంస్థ సిబ్బంది, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మడపాంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నరసన్నపేట, ఏప్రిల్ 18(వార్త): మడపాం గ్రామంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాకివలస ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి వెలమల సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు. ఆయుర్వేదం ద్వారా అనేక వ్యాధులకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని ఆమె తెలిపారు. సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద మందులు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. ఈ శిబిరంలో రోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో జల ధార జల హారతి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18(వార్త): ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో స్పెషల్ ఆఫీసర్ (టెక్కలి ఆర్డిఓ) కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఈనెల థీమ్ "జల ధార - జల హారతి" అనే కార్యక్రమంలో భాగంగా 15వ వార్డులోని బంధ చెరువు ఆవరణలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జామి ఎల్లమ్మ గుడికి ఎదురుగా మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వార్డుల్లో పర్యటించి స్థానిక ప్రజలతో పారిశుధ్య నిర్వహణ గురించి త్రాగునీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సారవకోటలో ముగిసిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ

సారవకోట, ఏప్రిల్ 18(వార్త): సారవకోట మండలంలో మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో రైతు సాధికారిక సంస్థ తరఫున నిర్వహించిన రెండు రోజుల ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమం ముగిసింది. రెండో రోజు నిర్వహించిన ఫీల్డ్ లెవెల్ శిక్షణలో మొదటి రోజు నేర్చుకున్న అంశాలపై రీక్యాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంవత్సరం పొడవునా (365 రోజులు) పంటలు ఎలా సాగు చేయాలో, ఎల్‌నినో ప్రభావాన్ని ఎలా అధిగమించాలో వివరించారు. పీఎండీఎస్ ద్వారా రైతులకు ఆదాయ మార్గాలను ఎలా పెంచుకోవాలో అవగాహన కల్పించారు. అలాగే డ్రౌట్ ప్రూఫ్, హాఫ్ మూన్ మోడల్స్, బీఆర్‌సీ విధానం, 365 డీజీసీ పంటల సరళి వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. విత్తనం నాటడం నుంచి పంట కోత వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాల్సిన విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ విధానాలను ఈ సంవత్సరం రైతులకు విస్తృతంగా చేరవేయాలని సూచించారు. ఇందుకు వీఏఏలు, వీఏహెచ్‌ఏలు, ఐసీఆర్‌పీలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, వీఏహెచ్‌ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'యూ' ఆకారంలో ఇచ్ఛాపురం మున్సిపల్ మోడల్ మార్కెట్

ఇచ్ఛాపురం ఏప్రిల్ 18 (వార్త): ఇచ్ఛాపురం మున్సిపల్ డైలీ మార్కెట్ ను 'యూ' ఆకారంలో నిర్మాణానికి డి పి ఆర్ సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు మార్కెట్ వ్యాపారులు తో సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం అర్బన్ డేవలెప్మెంట్ అథారిటీ (సుడా)ఆధ్వర్యంలో నిర్మాణం నిమిత్తం మార్కెట్ ను పరిశీలించారు. సు డా ఎస్ ఈ పి.సుగుణాకర్ రావు, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ టెక్కలి ఆర్ డి ఓ కృష్ణమూర్తి కమిషనర్ రమేష్ లు చర్చించారు. 5 కోట్ల రూపాయల వ్యయం అంచనా తో రూపొందించగా ప్రస్తుతం ఉన్న మార్కెట్ పడగొట్టి యూ ఆకారంలో గ్రౌండ్ ఫ్లోర్ మొదటి ఫ్లోర్ తో రెండు అంతస్థుల నిర్మాణం చేపట్టి మధ్యలో పార్కింగ్ కి అవకాశం కల్పిస్తామని చెప్పారు. 2.50 కోట్ల రూపాయలు బ్యాంక్ రుణం కాగా మిగిలిన 2.50 కోట్ల రూపాయలు వ్యాపారస్తులు నుండి సేకరిస్తామని చెప్పారు. దిగువ 50 షాప్ లు, పైన 50 షాప్ లు నిర్మాణం చేపడతామని దిగువ ఒక్కో షాప్ కి 3.50 లక్షల రూపాయలు నిధులు సేకరిస్తామని చెప్పారు. పైన షాప్ లకు 3 లక్షల రూపాయల చొప్పున కేటాయిస్తామని అన్నారు. ప్రస్తుతం వ్యాపారం చేస్తున్న వారికే ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. కిరాణా, కూరగాయలు, చేపలు మాంసాహారం దుకాణాలు వేరువేరుగా ఏర్పాటు చేస్తామని అన్నారు. దుకాణదారులు తమ సమ్మతి తెలియజేస్తే పనులు ప్రారంభం చేయడానికి సన్నాహాలు సిద్ధం చేస్తామని అన్నారు. ఎన్నికల కోడ్ లేకపోతే మరో ఐదు నెలల లో పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

ఏసీఏ క్రికెట్ సబ్ సెంటర్‌లో స్వచ్ఛత కార్యక్రమం

- పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యం: చిట్టిబాబు

నరసన్నపేట, ఏప్రిల్ 18(వార్త): నరసన్నపేట జూనియర్ కళాశాల మైదానంలోని ఏసీఏ క్రికెట్ సబ్ సెంటర్ వద్ద శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎంసీఏ సెక్రటరీ గొద్దు చిట్టిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్రీడాకారులు సబ్ సెంటర్ పరిధిలోని చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. కార్యక్రమంలో పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం మన వెంటే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ క్రికెట్ కోచ్ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

ఇంటర్‌లో జలుమూరు విద్యార్థినికి స్టేట్ సెకండ్

జలుమూరు, ఏప్రిల్ 18(వార్త): జలుమూరు జూని యర్ కళాశాలకు చెందిన సెకండ్ ఇయర్ బైపీసీ విద్యార్థిని మౌనిక ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. వెయ్యి మార్కులకు గాను 990 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఈ సందర్భంగా నరసన్నపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి నరసింహమూర్తి, మామిడి సత్యనారాయణ కళా శాలను సందర్శించి మౌనికను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నరసింహమూర్తి మాట్లాడుతూ, ఈ జూనియర్ కళాశాలకు గొప్ప చరిత్ర ఉందని, అనేక మంది మేధావులను తయారు చేసిన విద్యాసంస్థగా గుర్తింపు పొందిందని కొనియాడారు. ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులు తమ కుటుంబం, కళాశాల, ప్రాంతానికి గౌరవాన్ని తీసుకువస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జామి సారిక, అధ్యాపకులు పి.ఉమామహేశ్వరరావు (తెలుగు), కె. కాంతారావు (ఇంగ్లీష్), పి.రామమోహన్ (ఫిజిక్స్), పి. సురేష్ (కెమిస్ట్రీ), ఎస్.హరిబాబు (మాథ్స్), దుర్గాప్రసాద్ (జువాలజీ), డి. నవీన్ (బోటనీ), ప్రసాదరావు (హిస్టరీ), ఎం.భీమారావు (ఎకనామిక్స్), రామకృష్ణ (కామర్స్), వొకేషనల్ లెక్చరర్లు ఎం.నిరంజన్, సి.హెచ్. నాగేష్ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పలాస, ఏప్రిల్ 18 (వార్త): తాళభద్ర రైల్వే గేట్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం శనివారం స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. మృతుడు వడ దెబ్బకు గురైనట్టు ఉందన్నారు. మృతుడు ఆచూకీ తెలిస్తే కాశీబుగ్గ పోలీసులకు సమాచా రం అందించాలని విజ్ఞప్తి చేశారు. మృదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని శరీరంపై గడిలితో కూడిన ఎరుపు రంగు షర్టు, జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. ఎవరికైనా మృతుడు ఆచూకీ తెలిస్తే వివరాలు చెప్పాలని పోలీసులు కోరారు. కాశీబుగ్గ పోలీసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18(వార్త): ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇచ్ఛాపురం విద్యార్థులతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులందరూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నినాదాలతో, ప్లకార్డ్స్ పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రధానోపాధ్యాయులు కే.సూర్యారావు, సీనియర్ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, పాఠశాల సెక్రటరీ సాయి బాబా గీతరాణి, కామరాజు, సూర్యం వెంకట్రావు, జోగేష్ , వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్, రంగారావు పాల్గొన్నారు.

మామిడి పంట రక్షణపై రైతులకు సూచనలు

నరసన్నపేట, ఏప్రిల్ 18(వార్త): మామిడి పంటలు చేతికి అందుతున్న వేళ రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఉద్యానవన శాఖ మండల అధికారి సునీత సూచించారు. శనివారం తామరపల్లి గ్రామంలో మామిడి రైతులతో సమావేశమై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చెట్టుకు ఉన్న మామిడికాయలకు తప్పనిసరిగా పేపర్ కవర్లు అమర్చాలని సూచించారు. ఇలా చేయడం వలన కాయలు పురుగుల నుండి రక్షించబడటంతో పాటు మంచి అభివృద్ధి చెందుతాయని వివరించారు. ఈ క్రమంలో 500 పేపర్ కవర్లను మామిడికాయలకు అమర్చడం జరిగిందని తెలిపారు. రైతులు ఈ విధానాన్ని అనుసరించి పంట నాణ్యతను పెంచుకోవాలని సూచించారు.

గర్భిణులు, చిన్నారుల సంరక్షణపై అవగాహన

నరసన్నపేట, ఏప్రిల్ 18(వార్త): గర్భిణీలు, చిన్నారుల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్యామలమ్మ సూచించారు. శనివారం నరసన్నపేట మండలం మడపాం అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెండు సంవత్సరాలలోపు చిన్నారుల ఎదుగుదలతో పాటు జ్ఞాపకశక్తి అభివృద్ధి కూడా జరుగుతుందని తెలిపారు. ఈ దశలో సరైన పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, గర్భిణీల సంరక్షణలో నిర్లక్ష్యం చేయకుండా సమయానికి సేవలను పొందాలని కోరారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ఇచ్ఛాపురం ఏప్రిల్ 18(వార్త): అంబేద్కర్ వర్సిటీ శనివారం విడుదల చేసిన డిగ్రీ ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో ఇచ్ఛాపురంలోని స్వర్ణభారతి డిగ్రీ కళాశాల ప్రభంజనం సృష్టించింది. అన్వేష త్రిపాఠీ -9.2, కుప్పిలి వాణి - 9.2 (కంప్యూటర్ సైన్స్ హానర్స్), పాతిరల్ల దేవి -9.2, ఆళ్లు స్పందన - 9.2 (కెమిస్ట్రీ హానర్స్), జ్ఞానేశ్వరి -9.0 (బోటనీ హానర్స్), ఆశి.దీప-8.5(ఫిజిక్స్ హానర్స్) మార్కులతో నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ చాట్ల మహేశ్వరి, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ చాట్ల రాము, విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ సందీప్, జయప్రకాష్ మరియు కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు లావణ్య (ఎకనామిక్స్) 8.78, శిఖా మహాపాత్రో(ఫిజిక్స్) 8.50, ఆశి పుష్పలత(ఫిజిక్స్)8.00, జయదేవ్ బెహరా(మ్యాథ్‌మేటిక్స్) 8.39, కోలా రేణుక 8.17, అంజలినాయక్ (ఒరియా) 7.33 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు దుర్యోధన, శివకుమార్, సీతమ్మ, సంతోష్‌కుమార్, త్రిపాఠి, ఈశ్వరరావు, లోకేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

భూగర్భ జలాల పెంపు..నీటి భద్రతపై దృష్టి సారించాలి

-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపు

-అక్కురాడలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహణ



జలుమూరు, ఏప్రిల్ 18(వార్త): భూగర్భ జలాల పెంపు, నీటి భద్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపు నిచ్చారు. జలుమూరు మండలం అక్కురాడ గ్రామంలో నిర్వహించిన "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఉల్లిపాయ చెరువు పరిసరాలను పరిశుభ్రం చేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం మొక్కలు నాటి, స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. చెత్త ఇచ్చి అవసరమైన సరుకులు పొందే విధంగా స్వచ్ఛ రథాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్తులతో కలిసి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, వంద రోజుల ప్రణాళికలో భాగంగా "జలధార" పేరుతో నీటి భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. నీటి వనరులను పరిరక్షించడం, కాలుష్యాన్ని నివారించడం, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. కాల్వలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లను సంరక్షించి నీటి నిల్వలకు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని, పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, పిఏసిఎస్ డైరెక్టర్లు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, నీటి సంఘాల అధ్యక్షులు, తహశీల్దార్, ఎంపీడీవో, ఏపీవో, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అందరూ పరిశుభ్రత పాటించాలి

-డీఎంహెచ్ఓ డాక్టర్ కె. అనిత

శ్రీకాకుళం, ఏప్రిల్ 18 (వార్త): అందరూ పరిశుభ్రత పాటించాలని డిఎంహెచ్ఓ డాక్టర్ కె. అనిత పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంగ ణంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర, జలం-జీవం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటి సంరక్షణకు పాటుపడాలని, నీటి కుంటలను, చెరువులను, బావులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నీటిని వృధా చేయకుండా కాపాడాలని, ఇంటిలోని ఉపయోగించే నీటిని పునర్వి నియోగించే దిశగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా దోమలు పెరుగుదలను నివారించేందుకు, సమా జంలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డా.వెంకటరావు, హెచ్.ఇ.ఇ.ఓ ముఖలింగం, డిప్యూటీ డెమో కె.యర్రన్న, డిప్యూటీ హెచ్.ఇ.ఓ పి.మోహిని, రత్నకుమారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కల్పించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి

శ్రీకాకుళం, ఏప్రిల్ 18 (వార్త): "శిక్షణ పొందిన విద్యార్థులు తమకున్న నైపుణ్యంతో సొంతంగా కుటీర, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించి నూతన పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి బాటలో నడవాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు ఆకాంక్షించారు. కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎం ఎస్ ఎం ఈ, ప్రపంచ బ్యాంకు సహకారంతో 20 రోజుల పాటు నిర్వహించిన ఎంటర్ప్రెన్యువర్షిప్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి యు. సాయికుమార్ మాట్లాడుతూ.. నూతన వ్యాపారాలు ప్రారంభించే వారికి ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలను అందిస్తుందని, విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఇతరులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఐటి ప్రాజెక్ట్ ఇంచార్జ్ జి. అరుణ్ కుమార్ విద్యార్థులకు కాటన్ బ్యాగులను పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

కోఆర్డినేటర్ ఎల్. కృష్ణారావు మాట్లాడుతూ.. రామోజీరావు, గ్రంధి మల్లికార్జున రావు వంటి ప్రముఖుల స్ఫూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస కాశీబుగ్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా రాము

పలాస, ఏప్రిల్ 18 (వార్త): పలాస కాశీబుగ్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా అంది రామును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పలాస ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సీనియర్ జర్నలిస్టులు డి.మహరణ, రమణ, హరినారాయణ, సిహెచ్ జగదీష్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ పువ్వల జోగారావు (శివజ్యోతి), ఉపాధ్యక్షులుగా డి.రాజగోపాల్, దుర్యోధన మహారణ, కార్య దర్శిగా గోరు భాస్కరరావు, సహాయ కార్యదర్శిగా నంబల రమేష్, కోశా ధికారిగా నల్లాన అశోక్ కుమార్(జాతీయ వార్త), సహాయ కార్యదర్శిగా సవర చిన్నబాబు, ముఖ్య సలహాదారులుగా వంకల రాజారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాము మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని, తనను నమ్మి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానని తెలిపారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అధ్యక్షునిగా రాము ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో హరి, రమణ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలకు ఆండ్రాయిడ్ మొబైల్స్ పంపిణీ

నరసన్నపేట, ఏప్రిల్ 18(వార్త): నరసన్నపేట ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మహిళా సమాఖ్య అధ్యక్షులకు ఆండ్రాయిడ్ మొబైల్స్ పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన మహిళా సమా ఖ్య సంఘాల అధ్యక్షులకు ఈ మొబైల్స్ అందజేశారు. నరసన్నపేటలో 47 మంది, సారవకోటలో 47 మంది, పోలాకిలో 45 మంది, జలుమూరులో 49 మంది అధ్యక్షులకు మొబైల్స్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెలుగు పథకం ద్వారా మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో మహిళలు మరింత ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుచ్చల కల్పన, నాలుగు మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

కరవంజ పాఠశాలను ఎంఈవో ఆకస్మిక తనిఖీ

జలుమూరు, ఏప్రిల్ 18 (వార్త): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడే విధంగా బోధన నిర్వహించాలని ఎంఈఓ బమ్మిడి మాధవరావు సూచించారు. శనివారం కరవంజ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను నేరుగా పరీక్షించి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. ప్రతిరోజూ హోం వర్క్‌తో పాటు వర్క్‌బుక్‌లు కూడా అందజేసి విద్యార్థుల అభ్యాసాన్ని బలోపేతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి భోజన నాణ్యత, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

సత్యవరం పాఠశాలలో 'బడి పిలుస్తుంది' ర్యాలీ

నరసన్నపేట, ఏప్రిల్ 18(వార్త): సత్యవరం ప్రాథమిక, జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న 'బడి పిలుస్తుంది' కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాలరావు, జిల్లా విద్యాశాఖ అధికారి రవిబాబు పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన ర్యాలీలో అధికారులు పాల్గొని అనంతరం తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్య, సౌకర్యాలు, సంక్షేమ పథకాలపై తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీర్ఘాసిలో ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

పోలాకి, ఏప్రిల్ 18(వార్త): దీర్ఘాసి గ్రామంలో శనివారం ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోగోటి రామచంద్రరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తారని, పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేయాలని సూచించారు.

బడిపిలుస్తోందిలో ఎంజీఆర్

ఎల్ఎన్ పేట, ఏప్రిల్18(వార్త): దబ్బపాడులో శనివారం నిర్వహించిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ పిల్లవానికి విద్య హక్కుఅని తల్లిదండ్రులు తమ పిల్లల్ని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలకు వంపించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, పౌష్టికాహారం, డిజిటల్ క్లాసులు వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మెండ మనోహర్, ఏఎంసీ వైస్ చైర్మన్ కొవిలాపు కృష్ణమాచార్య, పాతపట్నం నియోజకవర్గ తెలుగుయువత నాయకులు అంపిలి పోలినాయుడు, మాజీ సర్పంచ్‌లు జమ్మి మోహనరావు, వెలమల గోవిందరావు, నడిపల్లి నారాయణరావు, మండల విద్యాశాఖాధికారులు, సీఆర్పీలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546